క్లుప్తంగా

పూర్వీకుల సమాధులకు మంత్రి వనిత నివాళి



గౌరీపట్నంలోని పూర్వీకుల సమాధులకు హోం మంత్రి తానేటి వనిత నివాళులు

దేవరపల్లి: ఈస్టర్ సందర్భంగా రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మండలంలోని గౌరీపట్నంలోని తమ పూర్వీకుల సమాధులను, తాళ్లపూడి మండలం తుపాకులగూడెంలోని తన తల్లి జొన్నకూటి సుశీల సమాధిని ఆదివారం సందర్శించారు. సమాధులపై పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అక్కడ నిర్వహించిన ప్రార్థనల్లో మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు.

గోమాత సాక్షాత్తూ ప్రత్యక్ష దైవం

నల్లజర్ల: గోమాత సాక్షాత్తూ ప్రత్యక్ష దైవమని ధర్మ సంస్థాపన ఫౌండేషన్ అధ్యక్షుడు పీడీ చారి అన్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గో సంరక్షణ నినాదంతో ఆదివారం తాడేపల్లిగూడెం నుంచి ద్వారకాతిరుమల వరకూ వందే గోమాతరం నినాదంతో పాదయాత్ర నిర్వహించారు. ఆ పాదయాత్రకు మండలంలోని అయ్యవరం గ్రామంలో ఆ ఫౌండేషన్ నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు మద్దూరి విష్ణుమూర్తి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీడీ చారి మాట్లాడుతూ ఏ దేవాలయానికి వెళ్లినా అక్కడ కనిపించేది విగ్రహం మాత్రమే అని, కానీ ముక్కోటి దేవతల రూపంలో రోజూ చూసేలా మనకు గోమాతను అందించారన్నారు. ప్రతి హిందువూ బాధ్యతగా గోవులను సంరక్షించాలన్నారు. గోవులకు ఆహారాన్ని అందించి గో సేవ చేసుకోవడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతిజిల్లా, మండలాల్లో గో సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని వాటిని కాపాడుకుందామని పిలుపు ఇచ్చారు. ఈ పాదయాత్రలో అనంతలక్ష్మి, యలమంచిలి అధ్యక్షుడు జద్దు శ్రీనివాస్, ఉలుసు నాగలక్ష్మి, మద్దాల సీతాలక్ష్మి, మద్దాల రాణి, ఇంటి మంగరాజు, తాతపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణంలో వైఎస్సార్ సీపీ ప్రచారం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ తరఫున మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదివారం పట్టణంలోని రెండో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో నిడదవోలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న జి.శ్రీనివాస్‌నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి తలారి పరామర్శ

చాగల్లు: ఊనగట్లకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త అక్కబత్తుల స్టీఫెన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్టీఫెన్ కుటుంబ సభ్యులను శనివారం రాత్రి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి తలారి వెంకట్రావు పరామర్శించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ చిత్ర పటానికి తలారి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఊనగట్ల సర్పంచ్ మట్టా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిల్లి నాగరాజు, వార్డు సభ్యులు సురేష్, పి. అప్పన్న, గంద్రోతు అరవింద్, వీరవల్లి పూర్ణచంద్రరావు, మట్టా సీతారాములు, నార్గాని నాని పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్టు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామం పరిధిలో నిర్వహిస్తున్న కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక పందెపు కోడిని, రూ 4,020 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఐ. పంగిడిలో నలుగురు..

కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామ శివారు పొలాల్లో కోడి పందేలు ఆడుతున్న నలుగురిని ఆదివారం అరెస్టు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,600 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు, స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దేవరపల్లి: బందపురం అడ్డరోడ్డు వద్ద అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాలపురానికి చెందిన దొప్పసాని నాగలక్ష్మి (32) ఆదివారం మృతి చెందింది. బందపురం అడ్డరోడ్డు వద్ద గల నిమ్మకాయల దుకాణంలో ఆమె నిమ్మకాయల గ్రేడింగ్ పనిచేస్తుంది. బైక్‌పై శనివారం ఉదయం ఆమె నిమ్మకాయల దుకాణానికి బయలుదేరింది. బైక్‌ను మలుపు తిప్పుతుండగా వెనుక వైపు నుంచి వస్తున్న మరొక బైక్ ఢీ కొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మిని గోపాలపురం సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీస్తు పునరుత్థానం.. విశ్వాసులకు పర్వదినం

- ఘనంగా ఈస్టర్ వేడుకలు
- కొవ్వొత్తులు వెలిగించి పూర్వీకులకు నివాళి
- చర్చిల్లో ప్రత్యేక ఆరాధనలు

నిడదవోలు: ఈస్టర్ (సమాధుల పండుగ)ను క్రైస్తవ సమాజం ఆదివారం ఘనంగా నిర్వహించింది. ఏసు ప్రభువు శిలువపై మరణించిన మూడో రోజు పునరుత్థానం పొందిన దినాన్నే ఈస్టర్‌గా క్రైస్తవులు ఆచరిస్తారు. స్థానిక చర్చిపేటలోని క్రైస్తవ సమాధుల తోటలోని తమ పూర్వీకుల సమాధులను ఆదివారం తెల్లవారుజామున క్రైస్తవులు పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలంటూ ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిలకు చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు. అలాగే స్థానిక కృపాధార లూథరన్ చర్చిలో ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు ప్రార్థనలు చేశారు. నియోజకవర్గంలోని క్రైస్తవులకు ఆయన ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. సంఘ కాపరి బయ్యే ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే తనయుడు వరుణ్ సాయి, కౌన్సిలర్లు గుర్రం శాంతిశ్రీ , దాకే అనిల్ కుమార్, ఉసురుమర్తి జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ సెయింట్ జాన్స్ లూథరన్ టౌన్ చర్చిలో యువత, మహిళా సమాజం స్త్రీలు దేవుని సువార్త గీతాలు ఆలపించారు. చర్చి చైర్‌పర్సన్ మెంటే దయా రాజగిరి, పాస్టర్ రెవరెండ్ మద్దా విజయభాను తదితరులు పాల్గొన్నారు. న్యూ స్పిరిట్ చర్చి, జీవం గల దేవుని సంఘం, సియోను, మరనాత ప్రార్థనా మందిరాలు, కేథలిక్ సెయింట్ జాన్స్ ప్యారిస్ చర్చిలలోనూ ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పునరుత్థానాన్ని వివరించే సువార్త గీతాలు ఆలపించారు.



కొవ్వూరు క్రిస్టియన్ శ్మశానవాటికలో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: ఈస్టర్ సందర్భంగా పట్టణంలోని క్రిస్టియన్ శ్మశానవాటికలో శనివారం నుంచి భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడి తమ పూర్వీకులు, కుటుంబ సభ్యుల సమాధులను క్రైస్తవులు శుభ్రం చేసుకుని పూలతో అలంకరించి, వారి ఆత్మలకు శాంతి చేకూరాలంటూ ప్రార్థనలు చేశారు. అలాగే చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక దైవ ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ దంపతులు, కౌన్సిలర్లు చీరా అరుణకుమారి, బత్తి నాగరాజు, నాయకులు కవల నాగేశ్వరరావు, మరపట్ల శ్రీనివాసరావు, గుబతాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: గౌరిపల్లిలోని క్రీస్తు కల్వరి ప్రేమ ప్రార్థన మందిరంలో సంఘ కాపరి యు. ఇజ్రాయిల్ దేవుని సందేశాన్ని విశ్వాసులకు వినిపించారు. పాపులను రక్షించడం కోసం ఏసుక్రీస్తు శిలువపై మరణం పొంది మూడో రోజున పునరుత్థానుడై సమాధి నుంచి తిరిగి లేచారన్నారు. ఆ రోజు క్రైస్తవులకు ఎంతో పవిత్రమైన పండుగ రోజు అన్నారు. మండలంలోని అన్ని చర్చిల్లోను ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆత్మీయులకు విందు ఇచ్చారు. క్రీస్తు పునరుత్థానాన్ని తెలియజేస్తూ క్రైస్తవులు ఉదయాన్నే ఆయా చర్చిల ఆధ్వర్యంలో ఊరేగింపులు నిర్వహించారు. ఎస్. ముప్పవరం ఆర్‌సీఎం చర్చి, చాగల్లులోని బైబిల్ మిషన్, పెంతెకోస్తు చర్చి, బెరాకా, ఆర్‌సీఎం, జీడీఎం చర్చిల్లోను, నెలటూరు సెయింట్ జాన్ లూథరన్ చర్చిల్లోను, మల్లవరం, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చిక్కాల, చంద్రవరం చర్చిల్లోను ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



నిడదవోలు చర్చిపేటలోని సమాధుల తోటలో పూర్వీకుల సమాధుల వద్ద క్రైస్తవుల ప్రార్థనలు



తాళ్లపూడిలో వేకువ జామునే పూర్వీకుల సమాధుల వద్ద క్రైస్తవుల ప్రార్థనలు



ఊనగట్ల చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో క్రైస్తవులు

తాళ్లపూడి: ఈస్టర్ సందర్భంగా వేగేశ్వరపురం, పైడిమెట్ట, ప్రక్కిలంక, మలకపల్లి, పెద్దేవం, గజ్జరం, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో క్రైస్తవులు తమ పూర్వీకుల సమాధులను తెల్లవారుజామున శుభ్రం చేసి రంగురంగుల పూలతో అలంకరించారు. వేగేశ్వరపురంలోని గోదావరి మేరీమాత పుణ్యక్షేత్రం వద్ద డైరెక్టర్ టి.జాన్ ఆధ్వర్యంలో ఈస్టర్‌ను ఘనంగా నిర్వహిచారు. అలాగే స్థానిక సెయింట్ పీటర్స్ లూథరన్, ప్రక్కిలంక, పైడిమెట్ట ఏపీ ఫానియా లూథరన్ చర్చిల్లో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు. మలకపల్లి చర్చిలో అపోస్తలుడు సీహెచ్‌ఎస్ స్వర్ణబాబు ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుక నిర్వహించారు.

నేడు ఊనగట్లలో 'తలారి' ప్రజాశీర్వాదం

కొవ్వూరు: చాగల్లు మండలంలోని ఊనగట్ల గ్రామంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రజాశీర్వాదం పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని ఆనంద తిరుమల వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వేడుకలు సోమవారం ప్రారంభం కానున్నాయి. దీంతో పాటు ఆలయ ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన నాగులపుట్ట, నాగబంధనం ప్రతిష్ఠ, అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. సోమవారం ఉదయం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవనం, ఋత్విక వరుణ దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠ, ఆకల్మష హోమం, చతుర్విధ స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వేడుకల చివరిరోజు భారీ ఎత్తున అన్న సమారాధన చేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వేద పండితులు పెదపూడి విజయవెంకటరమణ, వాడపల్లి శశికాంత్ బ్రహ్మత్వంలో ఈ క్రతువులు జరుగుతాయి.

45 మంది వైఎస్సార్ సీపీలో చేరిక



17వ వార్డులో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పట్టణంలోని 17వ వార్డు, సుబ్బరాజుపేటలో తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 45 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారందరికీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పార్టీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని, కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సూచించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై తాము వైఎస్సార్ సీపీలో చేరామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ పిట్ట పద్మావతి, కోఆప్షన్ సభ్యుడు దిరిసిన రామచంద్రరావు, గాజుల రంగారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్ కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్య సూర్యారావు, నిడదవోలు మండలం జేసీఎస్ ఇన్‌చార్జి వెలగన పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



కంసాలిపాలెంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు, యువతతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

కంసాలిపాలెంలో..

నిడదవోలు రూరల్: మండలంలోని కంసాలిపాలేనికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ నాయకులు మద్దాల సుబ్బారావు, ఉప్పాటి రమేష్, కొమ్ము వెంకటేష్‌లతో పాటు అరుంధతీపేటకు చెందిన మరో 40 మంది యువకులకు ఆ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు నిడదవోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధికి ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బెజవాడ నాగ గంగాధర్, నాయకులు ఉప్పాటి వెంకటేష్, ఉప్పాటి సత్యానందం, కొయి చిన్నా, నక్కా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అడ్డుకోవడం దుర్మార్గం

- ఇది చంద్రబాబు కుట్ర రాజకీయాలకు తార్కాణం
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కొవ్వూరు: వలంటీర్ల వ్యవస్థ ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరొస్తుందన్న భయంతోనే చంద్రబాబు తన జేబు సంస్థ ద్వారా ఇంటింటా పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టడానికి కారకుడయ్యారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు దుయ్యబట్టారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన పట్టణంలోని తన క్యాంపు కార్యాయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధులుగా పనిచేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన తెల్లవారకముందే వృద్ధులు, వికలాంగులకు, మంచానికే పరిమితమైన రోగుల గృహాలకు వెళ్లి, ఠంచనుగా పింఛను అందిస్తున్నారన్నారు. ఇంత మంచి సేవలను తన జేబు సంస్థతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయించి, చంద్రబాబు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. పేదల పింఛన్ల పంపిణీకి అడ్డంకులు పెడుతున్న చంద్రబాబుకు పుట్టగతులుండవని వెంకట్రావు అన్నారు. టీడీపీ హయాంలో మాదిరిగా పింఛనుదారులను ఇబ్బంది పెట్టడానికి చంద్రబాబు, ఆయన ఎల్లో బ్యాచ్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పింఛనుదారుల ఉసురు పోసుకునేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అనే జేబు సంస్థను చంద్రబాబు పావుగా వాడుకున్నారన్నారు. అలాంటి చంద్రబాబు అండ్ కో ఎల్లో బ్యాచ్‌ను ఎన్నికల్లో ప్రజలు క్షమించరన్నారు. ప్రజలకు చేరువైన వలంటీర్లను ఎన్నికల సమయంలో ప్రజల నుంచి దూరం చేయాలని చంద్రబాబు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకూ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే అన్నారు. చంద్రబాబు చీకటి రోజులను ప్రజలు మరిచిపోలేదన్నారు. ప్రజలంతా చంద్రబాబు బ్యాచ్ చేస్తున్న చేస్తున్న దుష్ట రాజకీయాలను గమనిస్తున్నారని ఎమ్మెల్యే తలారి అన్నారు. వలంటీర్లను తాత్కలికంగా దూరం పెట్టినా రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోవడం ఎవరితరం కాదన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- కోరుపల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం

నిడదవోలు రూరల్: సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, 58 నెలలుగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండలంలోని కోరుపల్లిలో ఆదివారం రాత్రి ఆయన ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, మోసపూరిత వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు, సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, కారింకి చినరాముడు తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- భీమోలులో ఇంటింటా ఎన్నికల ప్రచారం

గోపాలపురం: రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని రాష్ట్ర హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత అన్నారు. పార్టీ శ్రేణులతో కలసి ఆదివారం ఆమె మండలంలోని భీమోలు గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయంతో పాటు కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడానికి కూటమి పేరుతో విపక్షాలు మీ ముందుకు వస్తాయని, అలాంటి వారిని నమ్మవద్దని ఆమె ప్రజలను కోరారు. ఎన్ని కూటములు ఏర్పడినా ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి స్థిరంగా నిలిచిపోయారని వనిత అన్నారు. ఆమె ఇంటింటికీ వెళ్లి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు.



భీమోలులో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు, అసెంబ్లీ అభ్యర్థిగా తనకు రెండు ఓట్లు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా కన్వీనర్ యండపల్లి కవిత, సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, నాయకులు వెలగా శ్రీరామమూర్తి, ఎస్‌కే వల్లీ, కాకులపాటి శ్రీను, గెల్లా వెంకట శ్రీను, బండారు జగన్‌మోహన్‌రావు, వింటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- 10వ వార్డులో ఇంటింటా ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ప్రజలను కోరారు. పట్టణంలోని 10వ వార్డులో ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడికీ మేలు చేకూరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలను ప్రజలకు వివరించారు. కర పత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో ఆ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైస్సార్‌సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగ్గళ్లపాటి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, కౌన్సిలర్లు కంతమణి రమేష్, తోట లక్ష్మీ ప్రసన్న, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు సిద్ధన వాసు, దొమ్మేరు పీఏసీఎస్ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, పతివాడ రామారావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, గంగాధర నాగేశ్వరరావు, చిట్టూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు 10వ వార్డులో ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వయోజనులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగ పరచుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి (డీఈఓ) కె.వాసుదేవరావు సూచించారు. ఓటు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించేందుకు పట్టణంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కొవ్వూరు ఎంఈవో కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ థియేటర్స్ కూడలి వరకూ సాగింది. ఈ సందర్భంగా ఓటు విలువను తెలియజేసే ప్ల కార్డులను ప్రదర్శించారు. అనంతరం గాయత్రి థియేటర్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఓటు హక్కు , స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం)పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంఈవో-2 రామకిషోర్, చాగల్లు ఎంఈవో ఓ.శుభాకర్, హెచ్ఎంలు మంగిన శ్రీరామారావు, రామానుజం, విజయ్‌కుమార్, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, పీడీల అసోసియేషన్ నాయకుడు అచ్చియ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఓటరు అవగాహన ర్యాలీలో డీఈఓ వాసుదేవరావు తదితరులు



తాళ్లపూడిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

తాళ్లపూడి: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు సూచించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం కేంద్ర సాయుధ బలగాలతో కలసి పోలీసులు కవాతు నిర్వహించారు. తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో నిర్వహించిన కవాతులో 200 మంది భద్రతా దళాల వారు పాల్గొన్నారు. అనంతరం వేగేశ్వరపురం ఎస్సీ ఏరియా వాసులకు ఎన్నికలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామారావు మాట్లాడుతూ రూ.50 వేలకు మించిన నగదును ఎవరూ దూర ప్రాంతాలకు తీసుకు వెళ్లరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలపై రాజకీయ పార్టీల గుర్తులు ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికల సమయంలో యువత అల్లర్లు, గొడవల జోలికి వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో ఎస్సై టి.శ్యామ్ సుందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించి మార్కెట్ సెస్ వసూలు

కొవ్వూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ వార్షిక సెస్ వసూళ్ల లక్ష్యాలను అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.3.69 కోట్లు మార్కెట్ సెస్‌గా వసూలు చేయాలనేది లక్ష్యం కాగా, రూ.5,04,49,000 వసూలైనట్టు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి టి. శ్రీనివాసులు తెలిపారు. నిర్దేశిత లక్ష్యం కంటే సుమారు 47 శాతం అదనంగా మార్కెట్ సెస్ వసూలు చేసినట్టు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరం కొవ్వూరు చెక్‌పోస్టు వద్ద రూ.90 లక్షలు వసూలు చేస్తే ఈ ఏడాది రూ.1.30 కోట్లు వసూలు చేశామన్నారు. లక్ష్యాల సాధనకు సమష్టిగా పనిచేసిన ఏఎంసీ సిబ్బందిని చైర్ పర్సన్ ఉప్పులూరి విజయలక్ష్మి అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.